సాక్షి
వికారాబాద్
సోమవారం । 29 । జనవరి । 2024



వేతన వెతలు!

'ధరణి'లో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. 8లో▸



తోటలకు ప్రోత్సాహమేది?

పండ్ల తోటలకు అనువైన నేలలు ఉన్నా ప్రోత్సాహం కరువైంది. రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. 8లో▸



ప్రత్యేక పాలన!

సర్పంచుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో.. గ్రామ పాలకులు ముందస్తుగానే పదవీ విరమణ చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

పేదలకు మెరుగైన వైద్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో టీఆర్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో 520 మందిని పరీక్షించగా వంద మందిని వివిధ ఆపరేషన్లకు ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పేదలకు 15 ఏళ్లుగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ముందుముందు సేవలను విస్తరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఆర్ మెడికల్ ఆస్పత్రి వైస్ చైర్మన్ రితీక్ రెడ్డి, కళాశాల వైద్య బృందం పాల్గొన్నారు.

తెలంగాణ రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: తెలంగాణ రైతు సంఘం 2024 క్యాలెండర్‌ను ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మారయ్య, మైబెల్లి, ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎం.రామకృష్టారెడ్డి, కార్యదర్శి ముసలయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని మారిక హైస్కూల్‌లో ఆదివారం జిల్లా కమిటీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టలేదని.. వెంటనే వాటిని చేపట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎరుపుల గాలయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యారంగ సమస్యల పరిష్కారంపై చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. జీఓ 317 ద్వారా నష్టపోయిన వారికి స్థానిక జిల్లాలో సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల సిఫార్సులకు అనుగుణంగా జిల్లాకు అక్రమంగా వచ్చిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, ఆడిట్ కమిటీ చైర్మన్ రఘుపాల్, జిల్లా కార్యదర్శులు, జిల్లాలోని 27 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సభ్యులకు అండగా ఉంటాం

విశ్వబ్రాహ్మణ సంఘం జాతీయ అధ్యక్షుడు రంగాచారి

బడంగ్‌పేట్: విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రంగాచారి అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఆదివారం తోట జంగారెడ్డి గార్డెన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం 5వ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని వ్యవస్థాపకులు జంగాచారి, రాజుచారి, వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం జాతీయ అధ్యక్షుడు రంగాచారి హాజరై మాట్లాడుతూ.. లక్ష రూపాయలతో ఏర్పడిన సంఘం నేడు కోటి రూపాయలకు చేరుకునేలా చేసి, సంఘానికి అండగా విశ్వబ్రాహ్మణులు నిలవడం సంతోషమన్నారు. సంఘం సభ్యులు ఇబ్బందులు పడకూడదనే నిధుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం సంఘంలో మరణించిన విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు రూ.4లక్షల చెక్కులను అందచేశారు. ఇంటి పెద్ద చనిపోతే సంఘం ఆధ్వర్యంలో వితంతు పింఛన్ ఇచ్చేలా ప్రణాళిక చేస్తుండటం సంతోషమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధన్‌మోహన్‌చారి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'నేవీ రాడార్' వద్దు

జిల్లా పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ కేంద్రం అలజడి రేపుతోంది. హిందూ మహాసముద్రంలో సంచరించే నౌకల కదలికలు, సంకేతాలకు గుర్తించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం. ఈ వీఎల్ఎఫ్(వెరీ లో ఫ్రీక్వెన్సీ) నుంచి వెలువడే రేడియేషన్‌తో జీవజాతులకు ప్రమాదం ఉంటుందని జిల్లా వాసులు, పర్యావరణ వేత్తలు వ్యతిరేకిస్తున్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మద్దతు ప్రకటిస్తున్న నేతలు

రేడియేషన్‌తో అటవీ ప్రాంతంలో విధ్వంసం

- దామగుండంను కాపాడుకుంటాం
- కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తాం
- సీఎం, పీఎంలను కలుస్తాం
- ఆపే వరకు ఐక్యంగా పోరాడుతాం
- 'ప్రకృతి విధ్వంసం–పరిణామాలు' రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

వికారాబాద్: నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ముందడుగు పడింది. జిల్లాలోని పూడూరు మండలంలో దామగుండం అటవీ ప్రాంతంలో నెలకొల్పేందుకు మార్గం సుగమమైంది. ఇటీవలే భూముల బదిలీ ప్రక్రియ జరిగింది. దేశంలో రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఫారెస్ట్, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు సంతకాల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో దామగుండం అటవీ పరిరక్షణ సమితి సభ్యులు, ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు, వివిధ పార్టీల నాయకులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 'ప్రకృతి విధ్వంసం–పరిణామాలు'పేరిట ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు. జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పూడురు మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఈ వీఎల్ఎఫ్‌ను ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ఈ ప్రాంత వాసుల ఆరోగ్యం కాపాడుకునేందుకు ఈ ప్రక్రియను నిలిపే వరకు ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. సీఎం, పీఎంలను కలిసి విన్నవిస్తామన్నారు. తమ ప్రాంత ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సుప్రీం కోర్టులో పిల్ వేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్‌ను దిగ్బందిస్తాం. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను సైతం ఆశ్రయించి దామగుండంను రక్షించుకుంటామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యకర్తలు మురళీధర్ దేశ్‌పాండే, స్వామి సత్యానంద, అన్వర్, హైకోర్టు న్యాయవాది రామ్‌చల్లా రాడార్ స్టేషన్ ఏర్పాటు చేస్తే జరిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయా పార్టీలు, ప్రజా సంఘాలు, దామగుండ పరిరక్షణ సమితి నేతలు నాగేందర్‌గౌడ్, వెంకటయ్య, రాజలింగం, రాజేందర్, రాఘవేందర్, రామన్నమాదిగ, మైపాల్, రామకృష్ణ, పెద్ది అంజి, గీతా, కృష్ణ, మల్లేశం, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ

- కొందరు ప్రజాప్రతినిధులే ప్రజాభిప్రాయ సేకరణకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటును ముందుండి నడిపిస్తున్నారు.
- కాలుష్యం ఏ రూపంలో ఉన్న ప్రమాదకరమే.. మనుషులతో పాటు అది వృక్ష, జంతు జాతుల మనుగడకు ప్రమాదం.
- ఇదే విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తాం.. త్వరలో వికారాబాద్ రానున్న ప్రధాని మోదీని సైతం కలిసి విజ్ఞప్తి చేస్తాం.
- ఈ ప్రాజెక్టు విషయమై ఇప్పటికే హైకోర్టులో కేసు వేశాం. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే సుప్రీం కోర్టులో పిల్ వేస్తాం.
- అవసరమైతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను, అంతర్జాతీయ వేదికలను ఆశ్రయించయినా సరే ఈ ప్రాజెక్టు ఆపుతాం.
- ఉద్యమ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తాం. కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తాం.

చర్చకు వచ్చిన అంశాలు

- దామగుండం రిజర్వ్ ఫారెస్టుకు చెందిన 2,900 ఎకరాలు స్థానికుల అభిప్రాయాలతో సంబంధం లేకుండా నేవీకి అప్పగించటం సరికాదు.
- ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు 12.78లక్షల మొక్కలు నరికి వేయాల్సి వస్తోందని ఫారెస్టు అధికారులు, నేవీ అధికారులు గుర్తించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా 12 వేల టవర్లు వస్తాయని ప్రాథమికంగా గుర్తించారు.
- ఈ దట్టమైన అటవీ ప్రాంతంలో జింకలు, అరుదైన కొండగొర్రెలు, 257 అరుదైన పక్షి జాతులు, ఔషధ మొక్కలు అంతరించే ప్రమాదం.
- 1989లో అమెరికాలో ఒక రాడార్ స్టేషన్ ఏర్పాటు చేశారు. రేడియేషన్‌తో మానవాళికి అపారనష్టం జరగడంతో ప్రజా ఉద్యమం కారణంగా 2004లో స్టేషన్‌ను తొలగించారు.
- మానవాళికి హాని చేయని .. రేడియేషన్ ముప్పులేని ప్రత్యామ్నాయ మార్గమే మన ప్రభుత్వం ఆలోచించాలి.
- ఈ దామగుండం ప్రాంతంలోనే నాలుగు నదులు జన్మిస్తాయి. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే రేడియేషన్ ద్వారా వాటి పరివాహక ప్రాంతాలకు ముప్పు వాటిల్లనుంది.
- దామగుండం, అనంతగిరి అటవీప్రాంతం సముద్రమట్టానికి 360 అడుగుల ఎత్తులో ఉండడంతో ప్రతీ సంవత్సరం నైరుతి రుతుపవనాలను అడ్డుకుని వర్షాలు కురిసేలా చేస్తాయి. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో చెట్లు నరివేయడంతో అటవీ ప్రాంతం తొలగిపోయి వర్షాలు కురవకుండా పోయే ప్రమాదం ఉంది.

'కడా' అభివృద్ధికి ప్రణాళికలు

- రూ.292 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రత్యేకాధికారికి అందజేసిన నేతలు
- త్వరలో పనుల ప్రారంభం

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొడంగల్ టౌన్, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, ఐనన్‌పల్లి, బూల్కాపూర్ గ్రామాల అభివృద్ధికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి రెండు రోజుల క్రితం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి రూ.292 కోట్లతో ప్రతిపాదనలు అందజేశారు.

విద్యకు ప్రాధాన్యం

మున్సిపల్ పరిధిలో వ్యవసాయ కళాశాల, మిల్లెట్ రీసర్చ్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల, ఆయుష్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. కొడంగల్‌లో పాల శీతలీకరణ కేంద్రం, యానిమల్ మార్కెట్, కొడంగల్ బస్టాండ్‌ను విస్తరించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.



వచ్చే వారం సీఎం రాక?

రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ప్రాంతానికి రాలేదు. మొదటిసారి కొడంగల్‌కు వస్తే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరిగే విధంగా ఉండాలని రేవంత్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి అధికారులతో పలుమార్లు చర్చించారు. కొడంగల్‌లో భవిష్యత్‌లో చేపట్టబోయే పనుల గురించి అంచనా వేశారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి కొడంగల్‌కు వస్తే ఆ స్థాయిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఉండాలని నిర్ణయించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి కొడంగల్‌లో పర్యటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.


ప్రతిపాదనలు

పని	కేటాయించిన నిధులు
మురుగు కాల్వల నిర్మాణం	రూ.35 కోట్లు
తాగునీటి సరఫరా	రూ.20 కోట్లు
సీవరేజ్ సిస్టం	రూ.12 కోట్లు
అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ	రూ.1.5 కోట్లు
మున్సిపల్ కార్యాలయం నూతన భవన నిర్మాణం	రూ.4.5 కోట్లు
క్రీడా ప్రాంగణం	రూ.2 కోట్లు
ఇండోర్ స్టేడియం	రూ.5 కోట్లు
స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్	రూ.9.5కోట్లు
లాహోటీ కాలనీ పార్క్ అభివృద్ధి	రూ.2.65 కోట్లు
పార్కులు, జిమ్‌ల ఏర్పాటుకు	రూ.16 కోట్లు
బీటీ రోడ్ల నిర్మాణం	రూ.12 కోట్లు
విద్యుత్ మరమ్మతులు	రూ.50 లక్షలు
ఫారెస్టు పార్క్	రూ.5 కోట్లు
కసిరెడ్డి కుంట అభివృద్ధి	రూ.5 కోట్లు
బండల ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి	రూ.1.5కోట్లు
వేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధి	రూ.2 కోట్లు
అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి	రూ.18 కోట్లు
వైకుంఠ ధామాలు	రూ.3 కోట్లు
బస్తీ దవాఖాన	రూ.80 లక్షలు
పబ్లిక్ టాయిలెట్స్	రూ.50 లక్షలు
పట్టణ సుందరీకరణ	రూ.10 కోట్లు
సీసీ రోడ్ల నిర్మాణం	రూ.37 కోట్లు
సెంట్రల్ లైటింగ్ సిస్టం	రూ.14 కోట్లు
పెండింగ్ పనులకు	రూ. 10 కోట్లు

నేతల చూపు 'హస్తం' వైపు!

నిన్న మాజీ ఎమ్మెల్యే.. నేడు ఎమ్మెల్యే

- వరుసగా సీఎంను కలుస్తున్న బీఆర్ఎస్ నేతలు
- రెండు రోజుల క్రితం కలిసిన మాజీ ఎమ్మెల్యే తీగల
- తాజాగా భేటీ అయిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్
- లోక్‌సభ ఎన్నికల వేళ చర్చనీయాంశంగా నేతల తీరు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీ అధిష్టానానికి షాక్‌ల మీద షాకులిస్తున్నారు. ఒకవైపు లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతుండగా, మరోవైపు జిల్లాలోని పలువురు నేతలు పార్టీని వీడేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలవగా, తాజాగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జిల్లా రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ అధిష్టానానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి దారిలోనే మరికొంత మంది నేతలు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

షాక్‌ల మీద షాక్‌లు

ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో 17 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించగా, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. చేవెళ్లలో స్వల్ప మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందినప్పటికీ.. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగింది. పరాజయంతో బీఆర్ఎస్ తన అధికారాన్ని కోల్పోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని పలువురు కీలక (గతంలో కాంగ్రెస్ నుంచి గెలుపొంది ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన నేతలు) ప్రజాప్రతినిధులు ఆయన టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. వారు బీఆర్ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లోకి చేరేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ.. పార్టీ హైకమాండ్ ఇందుకు నిరాకరించడంతో వారంతా అక్కడే ఉండిపోయారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన వారు కాకుండా ఇతరులను పార్టీలోకి చేర్చుకోవాలనే యోచనలో హైకమాండ్ ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు రాజకీయ పలుకుబడి, సంస్థాగతంగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న నేతలను తమ గూటికి రప్పించే పనిలో నిమగ్నమైంది. ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలను చేర్చుకునే విషయంలో పార్టీ హైకమాండ్ ఆచితూచి వ్యవహరిస్తోంది. మాజీ ఎమ్మెల్యే తీగల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైనట్టు సమాచారం.

గులాబీ అధిష్టానం ఉక్కిరిబిక్కిరి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇటీవల శాసన మండలి మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు స్వామిగౌడ్ నివాసానికి వెళ్లారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నివాసానికి చేరుకున్నారు. గౌడ సంక్షేమ భవనం నిర్మాణం నేపథ్యంలోనే తమ భేటీ జరిగినట్లు అప్పట్లో వారు ప్రకటించారు. అప్పటికే పొన్నం వారిద్దరినీ పార్టీలోకి ఆహ్వానించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాజాగా ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌ను కలవడం, సలహాదారు వేంనరేందర్‌రెడ్డి ఆయనకు కండువా (మూడు రంగుల) కప్పడం, ఆ వీడియో సోషల్ మీడియా లో చక్కర్లు కొట్టడం ఇటు బీఆర్ఎస్‌లోనే కాకుండా అటు కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశమైంది. అయితే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. మర్యాదపూర్వకంగా సీఎంను కలిసినట్లు ప్రకటించారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, బహదూర్‌గూడ, ఘన్సిమియాగూడాలో పలు భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటికి పరిష్కార మార్గం చూపించాలని, నియోజకవర్గం అభివృద్ధికి ప్రతేక నిధులు మంజూరు చేయాలని సీఎంను అభ్యర్థించగా, ఇందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వస్తున్నా వార్తల్లో ఏ మాత్రం నిజం లేదన్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలోని పలువురు ముఖ్య నేతలు తరచూ అధికార కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్తుండటాన్ని బీఆర్ఎస్ అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది.

ఇక పక్కాగా.. ఎరువుల లెక్క

- ఫైవ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన వ్యవసాయశాఖ
- నిల్వలపై అధికారుల నిఘా

షాద్‌నగర్: ఎరువుల నిల్వలను కచ్చితంగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పారదర్శకంగా రైతులకు విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఫైవ్) పేరిట కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎరువుల కొరతకు చెక్ పెట్టడమే కాకుండా, నిల్వలపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచేందుకు ఇది తోడ్పడనుంది.

పక్కదారి పట్టకుండా..

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులను అందిస్తోంది. చాలా ప్రాంతాల్లో డీలర్లు ఎరువులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడుతున్నారు. కృత్రిమకొరత సృష్టిస్తుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారుల తనిఖీలు

వచ్చిన ఎరువులను అధికారులు ధ్రువీకరించడంతో పాటు నిల్వలు, విక్రయాలు ఈ పాస్ ద్వారా జరుగుతున్నాయా లేదా అనేది పర్యవేక్షిస్తారు. ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం దుకాణాల నిర్వహణ ఉందా లేదా అనేది తనిఖీల ద్వారా తెలుస్తుంది.

ఆన్‌లైన్‌లో నమోదు

డీలర్లు ఎప్పటికప్పుడు ఎరువుల క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయడంతోపాటు ఈ – పాస్ యంత్రాలు తప్పనిసరిగా వినియోగించాల్సి ఉంటుంది. ప్రతి డీలరు తమ దుకాణాల్లో చూపే నిల్వలు ఈ పాస్‌లో చూపించే నిల్వలతో సమానంగా ఉండాలి. విక్రయించిన రైతుల వివరాలతో పాటు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

నిమ్స్‌లో రోగి బలవన్మరణం

పంజగుట్ట/లక్డీకాపూల్: అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పంజగుట్ట పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వై.లక్ష్మీపురానికి చెందిన ఆరెంపుల అచ్చయ్య (55) అనారోగ్యం బారినపడి ఈ నెల 19న నిమ్స్‌లో చేరాడు. అతడికి వైద్యులు ఆపరేషన్ చేసి 27న స్పెషాలిటీ బ్లాక్ రెండో అంతస్తులోని ఓపీ బ్లాక్‌లో చేర్చి చికిత్స అందిస్తున్నారు. శనివారం రాత్రి 11 గంటలకు అచ్చయ్య భోజనం చేసిన తర్వాత బెడ్‌పై నిద్రపోయాడు. ఆయన కుమారుడు గుర్నాథం కుర్చీపై పడుకున్నాడు. తెల్లవారు జామున 3.15 గంటకుకు గుర్నాథం లేచి చూడగా మంచంపై తండ్రి కనిపించలేదు. వెంటనే వెయిటింగ్ రూం వాష్ రూంల్లో వెతికినా కనిపించలేదు. కిటికీలోంచి కిందకు చూడగా కొంతమంది దూకొద్దు అని అరుస్తుండటాన్ని గుర్నాథం గమనించాడు. అతను కిందకు వెళ్లేలోగా తండ్రి అచ్చయ్య కిందకు దూకేశాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అచ్చయ్యను నిమ్స్ సెక్యూరిటీ సిబ్బందితో కలిసి అత్యవసర విభాగానికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. ఉదయం 5.30 గంటలకు అచ్చయ్య మృతి చెందాడు. అనారోగ్యం, మానసిక ఒత్తిడితోనే తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వేతన వెతలు!



కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ధరణి ఉద్యోగులు (ఫైల్)

- ధరణి ఆపరేటర్లకు అందని జీతాలు
- పది నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- పట్టించుకోని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు
- రెగ్యులర్ చేయాలని డిమాండ్

దోమ : గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ధరణి (వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్) ప్రాజెక్టులో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు గత పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో పూట గడవక దీనావస్థలో వస్తులుంటూ అప్పులు తెచ్చి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 మండలాలు ఉన్నాయి. అందులో ఒక జిల్లా కోఆర్డినేటర్‌తో పాటు 20 మంది ఆపరేటర్లు, ఓ అదనపు ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. జీతాలు రాక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం మాపై దయదల్చి ఏజెన్సీ ప్రతినిధుల ద్వారా జీతాలను వేయించేలా చర్యలు తీసుకోవాలని వేడుకొంటున్నారు.

2018లో నియామకం

ప్రభుత్వం ధరణి రూపకల్పన చేసే సమయంలో కాంట్రాక్టు పద్ధతిన ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా 2018 మే నెలలో అప్పటి ప్రభుత్వం ఆపరేటర్లను నియమించుకుంది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఈ–సెంట్రిక్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా వీరిని రిక్రూట్ చేసుకుంది. తహసీల్దార్ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌లో వారిని నియమించగా, పారాడిగ్మ్ ఐటీ సోల్యూషన్స్ ద్వారా వీరికి జీతాలు అందుతున్నాయి. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో డెటా ఎంట్రీ చేసిన వీరు.. ధరణి పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి రిజిస్ట్రేషన్లలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే వీరికి ప్రతి నెలా రూ.18 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఉంటుందని ఏజెన్సీ ప్రతినిధులు తెలుపగా అవేవి అమలు కావడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. కానీ 2018 నుంచి 2021 వరకు నెలకు రూ. 9,878 ఇవ్వగా, ఆ తరువాత 2021 నుంచి 2023 మార్చి వరకు కొంత పెంచి రూ. 11,583 జీతాలను అందజేసింది. కాగా, గత పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలను అడిగితే ప్రభుత్వం నుంచి తమకు రావల్సిన కమిషన్ రావడం లేదని, ప్రభుత్వం నుంచి ఎప్పుడూ కమిషన్ వస్తే అప్పుడు జీతాలు ఇస్తామని ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారని ఆపరేటర్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెగ్యులర్ చేస్తేనే మేలు..

అరకొర జీతాలతో ఇబ్బంది పడడమే కాకుండా సమయానుకూలంగా జీతాలను వేయడంలో ఏజెన్సీ ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొత్త ప్రభుత్వం తమను గుర్తించి ఉద్యోగ భద్రత కలిపస్తూ రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ధరణి ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా మారింది. కార్యాలయాల్లో గంటలు, గంటలుగా పని చేస్తే జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఏజెన్సీ సమయానుకూలంగా జీతాలను వేయకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం.. కొత్త ప్రభుత్వమైన పెండింగ్ జీతాలను ఏజెన్సీ ప్రతినిధుల ద్వారా వేయించేలా చర్యలు తీసుకోవాలి

– అనిల్, జిల్లా ధరణి ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ధరణి ఆపరేటర్లకు ఏజెన్సీ ద్వారా వచ్చే జీతాలను వెంటనే ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీని ప్రభుత్వం రద్దు చేయించేలా చర్యలు తీసుకోవాలి. ధరణిలో పని చేసే ప్రతి ఆపరేటర్‌ను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

–మహేశ్, ధరణి ఆపరేటర్, దోమ

తల్లీకుమారుడి అదృశ్యం

పహాడీషరీఫ్: ఏడాది వయసున్న కుమారుడితో కలిసి ఓ తల్లి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాహిన్‌నగర్‌లోని అలీనగర్‌కు చెందిన షాహిన్‌బేగం(25), షేక్ రిజ్వాన్‌లు భార్యభర్తలు. వీరికి ఏడాది వయసున్న కుమారుడు షేక్ ఇర్ఫాన్ ఉన్నాడు. ఈ నెల 24న ఎవరికి చెప్పకుండా కుమారుడితో కలిసి బయటికి వెళ్లిన షాహిన్ బేగం తిరిగి ఇంటికి రాలేదు. స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో రిజ్వాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 8712662366 నంబర్‌లో సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డుకు చెందిన శివ(30) క్వారీ గుంతలో పడి శవమై కనిపించాడు. దీన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ దేవకి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఫైర్ సిబ్బంది సహాయంతో పోలీసులు గుంతలో నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఉంది. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రెండు మూడు రోజుల క్రితమే నీటి గుంతలో పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

గ్రామాలను అభివృద్ధి చేస్తాం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రామ్మోహన్ రెడ్డి

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

దోమ : గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కిష్టాపూర్‌లో సీసీరోడ్డు పనులు, అంబేడ్కర్, డ్వాక్రా భవనాలను స్థానిక సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ అనసూయతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నట్టేట ముంచిందని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధిలో నిర్లక్ష్యం వహించిందన్నారు. ఏ గ్రామంలో సక్రమంగా రోడ్లు లేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సీఎం రేంవత్‌రెడ్డితో మాట్లాడి ప్రత్యేక నిధులు తీసుకువస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యాదయ్యగౌడ్, శేఖర్, నర్సింహులు, శేషారెడ్డి, శివకుమార్, రాములు, మాధవులు, నర్సింహచారి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పర్యాటకుల సందడి

ధారూరు: మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చి సందడి చేశారు. చిన్నారులు కేరింతలు కొడుతూ, యువతీ, యువకులు సెల్ఫీలు, ఫొటోలకు ఫోజులిస్తూ ఎంజాయ్ చేశారు. ప్రీవెడ్డింగ్ కోసం కాబోయే వధూవరులు ఫొటోలు, వీడియో తీసుకుని ఆనందంగా గడిపారు.



భక్తిశ్రద్ధలతో ఊరడమ్మకు బోనాలు



పూజలు అందుకుంటున్న గ్రామ దేవత



బోనాల ఊరేగింపు

పెద్దేముల్ : పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో గ్రామస్తులు ఊరడమ్మా (గ్రామదేవత) జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గడపగడప నుంచి మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు విన్యాసాలు, ఏర్పులమ్మ భవిష్యవాణి జాతరల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి మూడేళ్లకు ఓ సారి అమ్మవారికి జాతర తీయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బోనాల వేడుకలో భక్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోనమెత్తిన ఏర్పులమ్మ

వేరుశనగ కోత మిషన్‌లో చున్ని ఇర్కుకొని.. గాయాలు

కుల్కచర్ల: వేరుశెనగ పంటను కోత మిషన్‌లో వేస్తున్న క్రమంలో యువతికి తీవ్ర గాయాలయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామానికి చెందిన నవీన(16) తండ్రి వెంకటయ్య తమ పొలంలో వేరుశెనగ(పల్లీలు) కోత మిషన్‌కు వేస్తున్న క్రమంలో చున్ని చుట్టుకోవడంతో మెడకు బలమైన గాయమైంది. దీంతో ఆమెను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆహారం కోసం కొంగల ఆరాటం



గుంపులుగా చేరి పురుగులను తింటున్న కొంగలు

ధారూరు: ఆహారం కోసం పక్షులు నిత్యం ఆరాటపడుతుంటాయి. వాటికి కావాల్సిన ఆహారం కోసం శ్రమిస్తాయి. పక్షుల్లో ఎక్కువగా కొంగలు సామూహికంగా ఆహార కోసం రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుంటాయి. రబీ వరిసాగులో భాగంగా పొలాలను ట్రాక్టర్లతో దున్నుతున్న ప్రాంతాల్లో ఇవి కాకుల్లా వాలిపోతాయి. దున్నుతున్న సమయంలో క్రిములు బయటకు రాగానే పట్టుకుని ఆరగిస్తాయి. గట్టిపల్లి గ్రామంలోని సరికొండ శేఖర్ వరిపొలంలో కొంగల గుంపు చేరి క్రిములను ఆరగించడం కన్పించింది.

వీధి కుక్కల స్వైర విహారం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఏదో ఒక కాలనీలో ప్రతి రోజు వీది కుక్కలు ప్రజలను వెంటపడి కరుస్తున్నాయి. దాంతో ప్రజలు రోడ్లపైకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో పేపర్ బాయ్‌ను ఓ వీది కుక్క కరిచింది. దాంతో బాలుడికి గాయాలయ్యాయి. దీనిని మరవక ముందే ఆదివారం ప్లెజెంట్ వ్యాలీ కాలనీలో ఓ వాచ్‌మెన్‌కు కరిచింది. దాంతో అతని కాలు రక్తసిక్తం అయ్యింది. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం ఓ వైపు కుక్కలకు వ్యాక్సిన్‌లు వేస్తున్న సమయంలోనే ఈ సంఘటన జరగటంతో చర్చానీయాంశమయ్యింది. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు వీది కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని పలు కాలనీల ప్రజలు కోరుకుంటున్నారు.

నిజాన్ని తట్టుకోలేక మొహం చాటేశారు

కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి అందె మోహన్

షాద్‌నగర్: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి నిజాలు మాట్లాడినందుకే బీజేపీ నేత డీకే అరుణ మొహం చాటేసారని కాంగ్రెస్ యువజన రాష్ట్ర కార్యదర్శి అందెమోహన్ ఆరోపించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత లోకసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ మంత్రి డీకే అరుణ రూ.15 కోట్లు ఇస్తేనే పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తా ను చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉండి మహబూబ్‌నగర్‌లోని రామాలయంలో ప్రమాణం చేసేందుకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి వచ్చారన్నారు. దేవాలయంలో ప్రమాణం చేసే సవాల్‌ను స్వీకరించకుండా డీకే అరుణ మొహం చాటేసారన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన విషయం వాస్తవం కాబట్టే ఆమె సవాల్‌ను స్వీకరించేందుకు రాలేదన్నారు.

పండ్లతోటలకు ప్రోత్సాహమేది?

జాడలేని ఉద్యానవన శాఖ అధికారులు

- రైతుల గోడు పట్టించుకోని ప్రజాప్రతినిధులు

పెద్దేముల్: పండ్ల తోటలకు అనువైన నేలలు ఉన్నా పోత్సాహం కరువైంది.. నీరు ఎంత విలువైందో ఆ రైతులు గుర్తించారు. రెండు అంగుడాల నీరు వస్తున్నా వివిధ రకాల కూరగాయ పంటలతో పాటు పండ్ల తోటలు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పోత్సాహం అందకా... ఉద్యానవన శాఖ అధికారులు అందుబాటులో లేక ...సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువవడంతో సాగు తగ్గుతుందని పలు గ్రామాల రైతులు అంటున్నారు. పదిహేనేళ్ల క్రితం జిల్లాలోని పెద్దేముల్ మండలంలో అరటి పంట వందల ఎకరాల్లో సాగు అయ్యేది.ఇక్కడ పండించిన అరటి పంటను మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు ఇతర ప్రాంతాలకు తరలించేవారు. జిల్లాలోని పెద్దేముల్ ,బషీరాబాద్, మోమిన్‌పేట ,మర్పల్లి, కోటపల్లి ,బంట్వారంతో పాటు పలు మండలాల్లో కూరగాయ పంటలతో పాటు పండ్లతోటలు సాగు చేస్తున్నారు. హైదరాబాద్ పట్టణంతో పాటు వికారాబాద్, జహీరాబాద్ , సంగారెడ్డి అందుబాటులో ఉండటంతో వీటి సాగుపై అన్నదాతలు ఆసక్తి చుపుతున్నారు.పెద్దేముల్ మండలంలోని హన్మాపూర్, పెద్దేముల్, తట్టిపల్లి, తింసాన్‌పల్లి, గోట్లపల్లి,గిర్మాపూర్, బుద్ధారం, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లో సుమారు1400 ఎకరాల్లో మామిడి, జామ, అరటితో పాటు కూరగాయ పంట లు సాగుచేస్తున్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తుంది. గతంలో గాజీపూర్, తింసాన్‌పల్లి, గోట్లపల్లి, బుద్ధారం, పెద్దేముల్ గ్రామాల్లో సుమారు 3నుంచి నాలుగు వేల ఎకరాలల్లో అరటితో పాటు మామిడి పంటలు సాగు అయ్యేవి. కేవలం గాజీపూర్ గ్రామంలో వెయ్యి ఎకరాల వరకు అరటి సాగు అయ్యేదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం 90 శాతం సాగు పడిపోయింది. ఇందుకు కారణం ప్రభుత్వ పోత్సహం లేక... సంబందిత అధికారుల సూచనలు ఇవ్వక పోవటం...ఉన్న అధికారులు అందుబాటులో లేకపోవడం... తెగుళ్లబారిన నుంచి పంటలు కాపాడుకోలేక విధిలేని పరిస్థితుల్లో సాగు తగ్గిస్తున్నట్లు రైతులు అంటున్నారు.



పెద్దేముల్ మండలంలో సాగవుతున్న అరటి తోట



మార్కెట్‌కు తరలిస్తున్న అరటి కాయలు

అరటికి అనువైన భూములు పెద్దేముల్ మండలంలో అరటితో పాటు పసుపు మామిడి, జామ పంటలకు అనువైన నేలలున్నాయి. గతంలో ఇక్కడ పండించిన అరటి పంటను ఇతర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు రైతులు, వ్యాపారస్తులు తరలించేవారు. గత ప్రభుత్వాల హయాంలో ఉద్యాన పంటలకు పోత్సాహం పెద్ద ఎత్తున ఉండేదని రైతులు పేర్కొంటున్నారు. కానీ, గత పదేళ్ల నుంచి ఉద్యానవన పంటలను పట్టించుకునే నాథుడు లేరని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కూరగాయ బాక్స్‌లు కూడా అందటం లేదని, మార్కెట్లో ఖరీదు చేసుకుంటున్నామని వివిధ గ్రామాల రైతులు అంటున్నారు. ఈ విషయమై మండల ఉద్యానవన శాఖ అధికారి కమలను వివరణ కోరేందుకు వెళ్లగా ఆమె అందుబాటు లేదు.

సబ్సిడీపై అరటి మొక్కలు ఇవ్వాలి

గత ప్రభుత్వాల మాదిరి ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీపై అరటి మొక్కలతో పాటు పండ్ల మొక్కలు అందచేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. కనీసం జామ మొక్క పెట్టాలన్నా ఖరీదు చేయాల్సి వస్తుందన్నారు. అలాగే డ్రిఫ్‌లను 90శాతం సబ్సిడీపై అందచేయాలని రైతులు కోరుతున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పడం తప్ప రైతులకు చేసింది ఏమి లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని ఉద్యాన అధికారులు

మండలంలోని తట్టిపల్లి, గాజీపూర్, గిర్మాపూర్, బండమిదిపల్లి,గోట్లపల్లి, బుద్ధారం, పెద్దేముల్, తింసాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు సుమారు 1400 ఎకరాల్లో మామిడి, అరటి, జామతో పాటు పలు రకాల కూరగాయ పంటలు సాగుచేస్తున్నారు. అందుల్లో సుమారు 600 ఎకరాల్లో మామిడి, 80 ఎకరాల్లో అరటి, 40 ఎకరాలో జామతో పాటు బొప్పాయి, పచ్చిమిర్చి, వంకాయ, టమాట వంటి కూరగాయలు సాగుచేస్తున్నారు. కాగా, అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్న చెట్లను నాటుకోవడం జరుగుతుందని రైతులు అంటున్నారు.

అందుబాటులో ఉండాలి



ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి."మండలంలో పండ్ల కూరగాయల సాగు పెంచాలి. ప్రభుత్వం అందచేస్తున్న సబ్సిడీ పరికరాలను రైతులకు తెలియచేయాలి. కనీసం నెలకు ఓ సారి మండలంలో అందుబాటులో ఉండాలి. రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలి. అప్పుడే పండ్ల సాగు పెరుగుతుంది.దానికి తోడు రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ బోర్లు, డ్రిఫ్, స్ప్రింక్లర్‌తో పాటు పండ్ల మొక్కలు అందించాలి

– ప్రకాష్‌రెడ్డి, రైతు గాజీపూర్

ప్రత్యామ్నాయ పంటలు



ఇరువై ఏళ్ల నుంచి అరటి పంటలను సాగుచేస్తున్నాను. అందుకు అనువైన భూములు ఉన్నాయి. గతంలో అరటి పంట బాగుసాగు చేశా. అధికంగా లాభాలు వచ్చేది. పంటకు తెగుళ్ళు రావడం అధికారులు అందుబాటులో లేక పంట నష్టపోవడం జరిగింది. దీంతో అరటికి బదులు వరి,కంది, మొక్క జొన్న పంటలను సాగుచేస్తున్నాం.

– వెంకటరెడ్డి, రైతు పెద్దేముల్

డ్రిఫ్, స్ప్రింక్లర్లు అందజేయాలి



రైతులకు డ్రిఫ్, స్ప్రింకర్లు అందచేయాలి. అప్పుడే రైతులకు సరైన న్యాయం జరుగుతుంది. డ్రిఫ్‌ల కోసం దరఖాస్తులు పెట్టిన ఇంత వరకు మండలంలోని రైతులకు అందలేదు.ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు.

– రాంరెడ్డి, రైతు గిర్మాపూర్